అప్పిచ్చువాడు

ప్రకాశరావు

ఉపోద్ఘాతం ఏమీ లేకుండా కుర్చీలో కూర్చుంటూనే చనువుగా అడగదల్చుకున్న విషయానికి వచ్చాడు రాజన్.

"కాస్త డబ్బు సర్దగలరా?"

"కాస్త డబ్బైతే సర్దగలను" చమత్కారం ఒలకబోశానన్నేను. అదే తరువాత కొంపలు ముంచుతుందని నాకేం తెలుసు!?

"కాదు, కాదు డబ్బు కాస్త సర్దగలరా అనాల్సింది, నేను" రాజన్ సరిదిద్దుకున్నాడు.

"ఏం కొంపలంటుకున్నాయి ఇప్పుడు?"

"మొన్న కలకత్తా టూరుకని అడ్వాన్సు డ్రాచేశాను ఫస్టుక్లాసు రిజర్వేషన్ దొరక్క త్రీ టయర్‌లో ప్రయాణం చేసినందుకు దాని తాలూకు డబ్బు రిటర్న్ చేయాలి. పై నెల

జీతంలో కోసుకోవయ్యా అంటే మన అకౌంట్సు ఆఫీసరు కాదు కుదరదు, ఫైనాన్సియల్ ఇయర్ పూర్తి అవుతూంది కదా. అకౌంట్సు బాలన్సు చేయాలి. ఈ నెనిల్లోనే అంటాడు. అంత డబ్బు మన అకౌంటులో లేదు. మీరు సర్దితే పై నెల జీతంలో ఇచ్చేస్తాను.

"వస్తు లేదీ ఇంకా పన్నెండు రోజులే అకౌంట్సు ఆఫీసరుకు మాత్రం ఇదేం పట్టు? ఈ గొడవలన్నీ ఎందుకని. ఎంత కావాలి?" అని మాత్రం అడిగాను.

చిన్న కాగితం ముక్క నా ముందుకు తోశాడు రాజన్—ఏడువందల అరవై రెండు చిల్లర.

డ్రాయర్‌లోంచి చెక్‌బుక్ లాగి ఏడువందల డెబ్బైకి చెక్కు వ్రాసి ఇచ్చాను. ధన్యవాదాలు చెప్పి తన ప్రతిజ్ఞను పునరుద్ఘాటించి మరీ వెళ్ళాడు రాజన్. మరి డబ్బుకి కటకట ఇప్పట్లో లేదు. మరో వేయి రెండువందలున్నాయి బ్యాంకి అకౌంటులో ప్రస్తుతం. నిట్టూర్చి మళ్ళీ పేపర్లు దిద్దటంలో పడ్డాను.

స్టూడెంట్సుతో రిసర్చి ప్రాబ్లమ్స్ చర్చిస్తూంటే మిశ్రా తలుపుతట్టి లోపలికి వచ్చాడు.

"కాస్త బయటకు రాగలరా? మీతో అర్జంటుగా ఒక ముఖ్య విషయం మాట్లాడాలి," సంకోచంగా అన్నాడు.

ఏమిటి అంత ముఖ్య విషయం అనుకుంటూ అతని వెనకే వెళ్ళాను.

"ఏం లేదు—అర్జంటుగా లక్నో వెళ్ళాల్సి వచ్చింది. పై వారంలో మా బామ్మర్ది పెళ్ళట. రేపే బయల్దేరి వెళ్లాలి. మన దేశంలో తెలుసుగదా మీకు పెళ్ళి అనగానే ఇవతలి జనానికూడా లోలెడాముదం. పెళ్ళికి వెళ్ళకపోవడం ఘోర తప్పిదం కింద లెక్కవేస్తారు. అందునా స్వంత అన్న పెళ్ళి అనగానే మా ఆవిడ హడావుడి చెప్పక్కర్లేదు. ఫారిన్ రిటర్న్‌డ్ డాక్టర్ మిశ్రా ఘోష.

"ఓ నాలుగైదు సరితే మీకు పోస్టు డేటెడ్ చెక్ ఇస్తాను. పై నెల్లో డ్రా చేసుకోండి. ప్లీజ్..."

నా వద్ద డబ్బు వుండగా లేదు అని కచ్చితంగా చెప్పలేని బలహీనత మొహమాటానికి దారితీస్తుంది. ఎప్పుడూ ఇలా సందిగ్ధావస్థ నుండి తేరుకోకుండానే మిశ్రా చకచకా చెక్‌బుక్ తీసి వ్రాయటం కూడా పూర్తిఅయింది, అంతలోనే నేను తేరుకుని అన్నాను. "మధ్యాహ్నం కచ్చితంగా చెప్పగలను. ఇప్పుడే చెక్కు వ్రాయకండి."

"నో, నో... ఇది బిజినెస్ కాదనుకోండి. ఒకే డిపార్టుమెంటులో వున్నవాళ్ళం అంచేత మీ వద్దకు మొహమాటం లేకుండా వచ్చాను. మిగిలిన వాళ్ళ సంగతి చెప్పాలా ఇక? మీలా ఓపెన్ మైండెడ్, హెల్ప్‌ఫుల్ నేచర్డు కారు, ఉట్టి దేవురింపు మొహాలు. అందుకే మీరంటే నేను ఏమాత్రం సంకోచించ

కుండా మా యింటి విషయాలు కూడా మాట్లాడ గలను." నన్ను ఉద్ధరిస్తున్న ఫక్కీలో మాట్లాడాడు మిశ్రా

ఇహ తప్పించుకోవడం ఎలాగూ చేత నవలేదు ఇంతలో రాజన్‌కు ఇచ్చిన డబ్బు గుర్తుకు వచ్చింది. వస్తుదాటి వారంరోజులయింది అతడినడిగి డబ్బు పుచ్చేసుకుంటే మళ్ళీ బ్యాంకి అకౌంటుకు బొక్క పెట్టకుండా మిశ్రాకు డబ్బు సర్దవచ్చు

"ఫరవాలేదు చెక్కు వుంచండి. మధ్యాహ్నం ఏమైందీ చెప్పగలను ఈ లోగా మీ కెక్కడేనా సర్దుబాటవుతే నా అవసరం వుండదు ఎలాగూ!" తెలి విగా మాటాడాననుకున్నా.

మిశ్రా వెళ్ళిపోయింతర్వాత రాజన్ డిపార్టుమెంటుకు ఫోను చేశాను దాదాపు రోజూ కనిపించే రాజన్ పోయిన పది రోజులుగా ఎక్కడా కలిసినట్టుగా జ్ఞాప కంలేదు బహుశా సెలవులో వున్నా డేమో ?

"హలో ? హలో రఘూ, నేను రాజన్ స్పీకింగ్."

"సారీ రాజన్! అర్జంటుగా నాకు డబ్బు అవసరం వచ్చింది. ఓ అయిదు వందలు సర్దగలరా ?" ఖర్మ నా డబ్బు కోసం నేనే బతిమాలుకోవాలి !

కాసేపు అవతలివేపు నిశ్శబ్దం

"హలో... సో సారి రఘూ. మీ డబ్బు విషయమే పూర్తిగా మరచి పోయాను సుమా ! ఇంట్లో హడావుడితో ఎక్కడా తీరడంలేదు, మీరు కూడా బొత్తిగా నల్లపూసై పోయారు మాఆవిడ కూడ ఒకటే సాధింపు 'మిస్టర్ రఘు రావటంలేదేం ?' అని ''ఏంటి మీ రిసర్చి కుర్రాళ్ళు అంతగా కాల్చుకు తింటు న్నారా ?''

"అబ్బే ! పై నెల్లో ఓ కుర్రాడు వెళ్ళి పోవాలని గోలపెడుతున్నాడు అతడికి అపాయింటుమెంటు లెటర్ వచ్చింది. ఈ మధ్యనే దాంతో ఎక్కడా తీరటంలేదు. మరో వారం రోజులదాకా నన్ను క్షమిం చాలి "

"దానికేంలే కానీ, పై వారం మా యింటికి రాకపోతే వూరుకునేది లేదు. మధ్యాహ్నం మా ప్యూనుతో చెక్కు వంపిస్తాను, అయామ్ రియల్లీ సారీ! ఏం అనుకోకూడదు మీకు చాలా ఇబ్బంది కలుగ జేసినట్టున్నాను సో సారీ. థాంక్యూ ! "

మధ్యాహ్నం రాజన్ ప్యూన్ రాలేదు కాని మిశ్రా మళ్ళీ వచ్చాడు రాజన్ చెక్కు వచ్చినా లాభంలేదు మిశ్రా రేపు వెళ్ళిపోతాడు రాజన్ చెక్కు ఏడు వందలపైన—మిశ్రాక్కావలసింది ఐదు వందలు ఇలా ఆలోచించి ఐదు వంద లకు చెక్కు వ్రాసి మిశ్రాపరం చేశాను పై నెల్లో ఇన్సూరెన్సు అనువల్ ప్రీమి యమ్ కట్టాలి రాజన్ చెక్కూ మిశ్రా

డబ్బు రెండూ నన్ను చేరితేనేగాని ఇన్సూరెన్సు కార్పొరేషన్ బాగ పడదు

మర్నాడు పనిలోపడి పూర్తిగా మరిచి పోయాను రెండోరోజు ఫోనుచేస్తే రాజన్ డిపార్టుమెంటులో లేడు మరో రెండు రోజుల తరువాత ఫోనుచేస్తే క్లాసులో వున్నాడు చిరాకేసి రాజన్‌ను నాకు ఫోను చేయమని చెప్పి వూరుకున్నాను. మర్నాడు లైబ్రరీలో ఎదురైన రాజన్ బిత్తరపోయినట్టుగా అనిపించింది నాకెందుకో, ఎంతో గిల్టీగా క్షమాపణ చెప్పుకున్నాడు నేను మరేం ఫరవాలేదు— పై నెల దాకా నా కంత ఇబ్బంది లేదు. అని చెప్పినా వినిపించుకోలేదు

"మా ప్యూనుకు చెక్ ఇచ్చి నాలుగు రోజులైంది ఆ లోఫర్ మీకు ఇచ్చినట్టు లేదు నిన్న మీరు ఫోను చేసినట్టుగా మా డిపార్టు మెంటులో చెబితే కనుక్కున్నాను మీకు చాల ఇబ్బంది కలుగ జేశాను ...సో సారీ" గబగబా వెళ్ళి పోయాడు రాజన్

మర్నాడు రాజన్ ప్యూను వచ్చి చెక్కు ఇచ్చి వెళ్ళాడు అదేరోజు ఆ చెక్కును బ్యాంకిలో జమకట్టాను

రాజన్ చెక్కు జమ కడుతుంటే నాకు మిశ్రా పోస్టుడేటెడ్ చెక్ జ్ఞాపకం వచ్చింది ఫస్టు తారీకు ఇంకా వారం రోజులేవుంది, కాని ఎంత వెదికినా ఆ చెక్ దొరకలేదు పైగా అతడు ఆ చెక్ నాకు ఇచ్చినట్టుగా కూడా జ్ఞాపకం రాలేదు చెక్ వ్రాసినట్టుగా మాత్రం గట్టిగా గుర్తు మిశ్రా తిరిగి రాగానే అడగాలని టేబుల్ కాలెండర్‌లో నోట్ చేసుకున్నాను

కాని రాజన్ ప్రవర్తనే నాకు గమ్మత్తుగా అనిపించింది ఎప్పుడూ పలకరించి స్కూటర్‌మీద లిఫ్ట్ ఇచ్చేవాడు ఇప్పుడు గమనించనట్టుగా పక్కగా దూసుకుపోతున్నాడు ఎదురయితే హఠాత్తుగా స్పీడు పెంచి తప్పుకు పోతున్నట్టుగా అనిపించేది లైబ్రరీలో ఎదురైతే 'హలో!' అని దాటుకు పోయేవాడు అతడి ఇంటికి వెళ్లాలని ఎన్నిసార్లు అనిపించినా ఎందుకో, బహుశా ఈ ప్రవర్తన వల్లే వెళ్ళలేక పోయాను

ఇన్సూరెన్సు ప్రీమియమ్ డ్యూడేట్ వచ్చింది వేయిన్నరకు చెక్కు వ్రాయబోయి పాస్‌బుక్కు చూసుకుంటే డబ్బు తక్కువగా వుంది, రాజన్ ఇచ్చిన చెక్ తిరిగి వచ్చింది మిశ్రా చెక్ ఇచ్చినట్టుగా జ్ఞాపకంలేదు. రాజన్ కనిపించడమే గగనమైపోయింది తెగ చిరాకు వేసింది నాకు

మిశ్రాను కనుక్కుంటే "సారీ రఘు! అప్పుడు మీకు చెక్ ఇవ్వడం మరచిపోయాను పై నెల్లో తప్పకుండా ఇచ్చేస్తాను. ప్లీజ్ బేర్ విత్‌మీ..." ఇంగ్లీషులోనూ హిందీలోనూ తెగ ఇదైపోతూ ప్రాధేయపడ్డాడు.

"పై నెల్లో తప్పకుండా ఇవ్వండి

దయచేసి" అనిమాత్రం అన్నాను మళ్ళీ నా కష్టాలు ఏకరువు పెట్టడం ఇష్టంలేక

మా ప్రొఫెసర్ కూతురి పుట్టినరోజు పార్టీకి వెళ్లి దగ్గరలోనే ఉన్న రాజన్ యింటికి వెళ్ళకుండా వుండలేకపోయాను రాజన్ ఇంట్లో లేదు, శ్రీమతి రాజన్‌ను అడిగాను, "ఇప్పుడప్పుడే వస్తారా? ఎంత సేపైంది వెళ్ళి?" ఇంతదూరం వచ్చి అతడిని కలుసుకోకుండా వెళ్ళబుద్ధివేయ లేదు.

"చాలా సేపైంది వెళ్ళి — ఎటు వెళ్ళారో తెలియదు "

ఓ పది నిమిషాలు వెయిట్‌చేసి చూద్దామనిపించింది వద్దని ఎంతచెప్పినా వినిపించుకోకుండా శ్రీమతి రాజన్ కాఫీ చేసి తెచ్చారు కాఫీ త్రాగుతూంటే వాళ్ళ ఇంటో పరిస్థితులూ, ఇబ్బందులూ చెబు తున్నారావిడ.

"మీ డబ్బు మరో రెండు వారాల్లో తప్పకుండా సర్దేస్తాం ప్లీజ్ ఏం అను కోకూడదు మొదట తీసుకున్నట్లుగా మీ డబ్బు వెంటనే తిరిగి ఇవ్వలేక పోయారు వారు ఈ విషయమే మదన పడిపోతున్నారు ...

ఆవి దలామాట్లాడుతూంటే నిర్విణ్ణుడి నయ్యా న్నేను అంతే నేను నా బాకీ తాలూకు డబ్బు వసూలు చేసుకునేందుకు వచ్చాననుకుంటున్నారా ఈవిడ? వడ్డీ వ్యాపారస్థుడిలా, ఇంటిమీదపడి యాగీ చేసేవాడిలా కనిపించానా నేను? ఎవరి కేనా డబ్బు సర్దితే డబ్బుతోపాటు వాళ్ళ ఇంటికి వెళ్ళే స్నేహాన్ని కూడ కోల్పోతా మన్నమాట. రాజన్ చెక్ తిరిగివచ్చిన సంగతి నేను రాజన్‌కు ఇంకా చెప్పలేదు అంటే చెక్ తిరిగి వస్తుందని రాజన్‌కు మొదటే తెలుసు? అందుకే అలాతప్పుకు తిరుగుతున్నాడు పరిపరి విధాలుగా ఆలో చనలు మెదడులో తిరిగాయి గొంతంతా తడి ఆరిపోయింది ఆవిడ గరిట తిరి గేసి నా తలపై బాదినా అంత తెల్లబోయే వాడిని కాదేమో? కాస్సేపు ఏం మాట్లాడ లేకపోయాను. గబగబా కాఫీ తాగి నన్ను నేను తమాయించుకుని.......

"ఫరవా లేదమ్మా మనలో మనకు అంతమాత్రం సహాయం చేసుకోకుంటే ఎలా...మా ప్రొఫెసర్ ఇంటికి వచ్చాను దగ్గరలోనేగదా అని ఇలా రాజన్ గారిని కలిసేందుకు వచ్చాను... పొడి పొడిగా మాట్లాడాను.

మరింకేం చెప్పాలో తెలియక వస్తా నని లేచాను కూర్చోమని ఆవిడ చెప్ప లేదు రాజన్‌కోసం కూర్చోవటం నాకు శక్యంకానిపని

మరో నెలరోజుల తర్వాత రాజన్ ప్యూను ఒక సీలువేసిన కవరూ దాంతో పాటు రాజన్ వ్రాసిన చిన్న నోటూ తెచ్చి ఇచ్చాడు ఆ కాగితం వెనకే ధన్య వాదాలు చెబుతూ వ్రాసి సంతకంచేసి తిప్పి పంపాను ఆ కవరు విప్పికూడా చూడాలనిపించ లేదు నాకు. రాజన్

మాత్రం ఎక్కడేనా ఎదురైతే "హలో రఘూ!" అని మాత్రం అని తప్పుకు పోతూంటే ఎంతో బాధగా అనిపించేది. స్నేహం మూలంగా డబ్బు సర్దితే దాని వల్ల నా ఇబ్బందుల విషయం అటుంచి స్నేహమే నిలువలేదు. నా తప్పు ఏమిటో ఎంతకూ అర్థంకాలేదు.

మిశ్రా నేనూ, ఒకే డిపార్టుమెంటు అవటం మూలాన ఎప్పుడూ ఇక్కడా, అక్కడా కలుసుకోవటం తప్పదు. అతడు నెలకో వంద వందాయాభై ఇస్తూ ఆర్నెల్లు పొడిగించాడు. కాని అతడు కూడా మొదట ఉన్న స్నేహభావంతో ఎప్పుడూ మాట్లాడలేదు, మళ్ళీ.

బిలియర్డ్సు ఆడి చేతులు తుడుచుకుంటూ బయటకు వస్తూంటే శుకా నెమ్మదిగా అన్నాడు.

"మీతో ఓ చిన్న విషయం మాట్లాడాలి."

ఇలా 'మాట్లాడలంటే' అర్థం తొందరగానే తెలిసిపోయింది నాకు. రెండుసార్లు చేతులు కాలాక ఏమైనా సరే ఇక ఎవ్వరికీ డబ్బు సర్దడం పెట్టుకోకూడదని దృఢంగా నిశ్చయించు కున్నానెప్పుడో. డబ్బు విషయం ఎలా వున్నా దానివల్ల వచ్చే మొహమాటాలకూ, పట్టింపులకూ తట్టుకోలేన్నేను.

"ఏంటా విషయం?" నా ఆలోచనలను అణచిపెట్టి వీలైనంత సౌమ్యంగా అన్నాను.

"అసలిలా మీతో మాట్లాడవల్సివచ్చినందుకు నన్ను మన్నించాలి మీరు," మృదువుగా అన్నాడు శుక్లా పైపు అంటించుకుంటూ," కాని నాకు మీ స్వభావం తెలుసు అందుకే ఇలా ధైర్యం చేస్తున్నాను..."

మరోసారి దృఢంగా అనుకున్నాను. ఇతడు డబ్బు విషయం ఎత్తగానే "నో ఐ ఏమ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ" అనేసి గబగబా దాటుకు వెళ్ళిపోవాలని.

కాస్సేపాగి, పొగనమలుతూ మళ్ళీ అన్నాడు శుక్లా.

"...రాజన్, మీరూ క్లోజ్ ఫ్రండ్స్ కదూ?" అతడలా మాట్లాడుతూంటే వింతగా అనిపించింది నాకు, మన స్నేహం అంత గొప్పది కాకపోయినా మీతో చెప్పాలనిపించింది. దయచేసి నన్ను అపార్థం చేసుకోకండి ... మిమ్మల్ని 'మర్చంట్ ఆఫ్ వెనిస్' అనీ 'షైలాక్' అనీ సంబోధిస్తూంటే సహించలేకపోయాను. ఏదో అత్యావసరంగా మీవద్ద కాస్త డబ్బు తీసుకుంటే ఆ డబ్బు తిరిగి వచ్చేదాకా డిపార్టుమెంటులో ఇంటికి వెళ్ళి సాధించేవారని డాక్టర్ మిశ్రా అతడూ జోకులేసుకుంటూ వుంటే ఆ విషయం మీకు చెప్పి హెచ్చరించటం శావ్యమని తోచింది నాకు. మీ రింకా ఈ వూరికి కొత్త. వీళ్ళ అలవాట్లూ, స్వభావాలూ మీకు సరిగా తెలియవు. మీ మెతకదనాన్నీ, సౌమ్య స్వభావాన్నీ ఇతరులు వాళ్ళ ఆవసరాలకు వాడుకో వచ్చు. ప్రత్యేకించి డబ్బు విషయంలో జాగ్రతగా వ్యవహరించాలి. ప్రతిరోజూ డబ్బుతో పేకాట ఆడుకొనే వాళ్ళకు మీ డబ్బు తీసుకుంటున్నప్పుడు వుండే ఆత్రం తిరిగి ఇచ్చేప్పుడు ఎలా వుంటుంది? వాళ్ళ బలహీనతలను కప్పిపుచ్చుకునేందుకు మీ గురించి చెడ్డగా మాట్లాడితే దాంట్లో ఆశ్చర్య పడాల్సిన విషయం ఏమీలేదు. కానీ, హామ్లెట్‌లో పోలోనీయస్ అడ్వైస్ మరచి పోయారా మీరు?..."లోన్ ఆఫ్ట్ లూజెస్ బోత్ ఇట్‌సెల్ఫ్ ఎండ్ ఫ్రండ్..." అని? నేను మాత్రం దాన్ని తు. చ. తప్పకుండా పాటిస్తాను."

నా భుజంమీద చేయివేసి గట్టిగా నొక్కాడు శుక్లా.

"రండి టీ తీసుకుందాం?"

యాంత్రికంగా శుక్లా వెంట నడిచాను.